కేసీఆర్‌ను కలిసిన భోలక్‌పూర్ బీఆర్ఎస్ నేతలు


ప్రవీణ్ కుమార్‌ను సన్మానించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

ముషీరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించినందున ప్రజలను చైతన్యవంతులను చేస్తూ బీఆర్ఎస్‌కు దగ్గరయ్యేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్‌ను కేసీఆర్ సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వినోద్, రాజు, కళ్యాణ్ పాల్గొన్నారు.

వరదనీటి నాలాలతో ఇబ్బందులు లేకుండా చర్యలు


నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, డీఈ గీతాకుమారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వరద నీటి నాలా వల్ల ప్రజలకు ముంపు తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్-17 బాప్టిస్ట్ చర్చి వీధిలో రూ.43 లక్షలతో చేపట్టిన నాలా పూడికతీత, పైకప్పు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గోపాల్, జీహెచ్‌ఎంసీ డీఈ గీతాకుమారి, ఏఈ మురళీతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నాలా అధ్వాన స్థితికి చేరడం వల్ల మురుగునీరు ఉపొంగుతూ ప్రవహిస్తోందని పేర్కొన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి 190 మీటర్ల పొడవున నాలాను ఆధునీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి, నాగులు యాదవ్, సుధాకర్ గుప్తా, పూస గోరక్‌నాథ్, ఎయిర్‌టెల్ రాజు, బల్వంత్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మార్పీఎస్ నేతలకు డప్పులను అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

ఎస్సీ వర్గీకరణ అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

కవాడిగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు లక్షల డప్పులు.. వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ పిలుపునిచ్చారు. ఈనెల 7వ తేదీన జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమవంతంగా ఎమ్మార్పీఎస్ నేతలకు డప్పులను అందజేసినట్లు ఆమె తెలిపారు. సోమవారం దోమలగూడలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్‌మాదిగ, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు దశరథ్, ఎల్లయ్య, గద్దె శ్రీనివాస్, సాయికృష్ణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

ఎమ్మార్పీఎస్ సభకు అనుమతివ్వకపోవడం దారుణం

● టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు వేల గొంతులు మహాప్రదర్శనకు అనుమతి ఇవ్వకపోవడం మాదిగలపై వివక్షను చూపడమేనని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎస్సీ వర్గీకరణపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలన్నారు. సోమవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ద్వంద వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో రమేష్, కొల్లూరి వెంకట్, చందు, నాగరాజు, రాజేష్‌కన్నా, కార్తీక్, సందీప్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

నల్లకుంట: సుప్రీంకోర్టు వర్గీకరణపై స్పష్టమైన తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వర్గీకరణ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ నేతలు ఆరోపించారు. సోమవారం నల్లకుంట డివిజన్ ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో 7న జరిగే లక్ష డప్పులు వెల గొంతుల కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నేతలు ఎడవల్లి యాదయ్య మాదిగ, జి.శంకర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సి.రఘువరన్ మాదిగ, సంగర్ జాతి సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం ఎల్లయ్య మాదిగ, కె.జె. బాబు మాదిగ, జి.సురేష్‌కుమార్, రాజేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో ఎంతో కాలంగా ఉండి పార్టీకి సేవలు అందిస్తున్న మహిళా నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, ఏఐసీసీ మహిళా విభాగం అబ్జర్వర్ డా.ఎస్తేర్‌రాణి మూర్తి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సోమవారం చిక్కడపల్లిలోని తన నివాసం వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లు ఇతర నామినేటెడ్ పోస్టులు ఇంకా భర్తీ కాకుండా మిగిలిపోయి ఉన్నాయని వాటిలో మహిళాకాంగ్రెస్ నేతలకు పోస్టులు ఇవ్వాలని కోరారు.

'కులగణన విడుదల చేయడం అభినందనీయం'

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కులగణన అధికారికంగా వివరాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం అభినందనీయం అని బీసీ రాజ్యాధికార సమితి చైర్మన్ దాసు సురేష్ పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సమితి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కులగణన లెక్కల ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2014లో నిర్వహించిన కుల గణన సర్వే వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలన్నారు. ప్రభుత్వం రెండు నివేదికలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. బీసీల అవకాశాలను హరిస్తే ఏ పార్టీ అయిన కాలగర్భంలోకి వెళ్లడం ఖాయమన్నారు. బీసీల డిమాండ్లను సాధించేంత వరకూ తమ సంఘం పోరాటం చేస్తుందన్నారు.

'లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమం ఢిల్లీలో చేయాలి'

నల్లకుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమం ఢిల్లీలో నిర్వహించకుండా గల్లీలో కొడితే శబ్దమే తప్పా వర్గీకరణ జరగదని జైభీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు పేర్కొన్నారు. సోమవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మెడలు వంచాలంటే తెలంగాణలో కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీల ఇంటి వద్ద చావుడప్పు పెట్టించాలని హితవు పలికారు. వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడంపై చర్యలు తీసుకోవాలని మందకృష్ణమాదిగకు సూచించారు. వర్గీకరణ అమలుకు అన్ని మాలల సంఘాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడిగా భరత్‌గౌడ్


నియామక పత్రాన్ని అందుకుంటున్న గుండగోని భరత్‌గౌడ్

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సికింద్రాబాద్ మహాకాళి జిల్లా (ముషీరాబాద్, సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల) అధ్యక్షుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ నియమితులయ్యారు. సోమవారం బీజేపీ అధిష్టానం ఆయన నియామకాన్ని ప్రకటించింది. బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి కాంతారావు, సికింద్రాబాద్ మహాకాళి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌లు ఆయనకు నియామకపత్రం అందజేశారు. భరత్‌గౌడ్ 1999లో ముషీరాబాద్ నియోజకవర్గంలోని చిక్కడపల్లి బూత్ అధ్యక్షుడుగా పనిచేశారు. 2007లో బీజేవైఎం ఉమ్మడి రాష్ట్ర కోశాధికారిగా, 2011లో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2015లో బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా పని చేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లిలోని తన నివాసం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్టత కోసం అంకితభావంతో చేసిన తన సేవలను గుర్తించి తనకు పదవి కల్పించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జీ బన్సాల్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సత్కారం

బీజేపీ సికింద్రాబాద్ మహాకాళి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన భరత్‌గౌడ్‌ను చిక్కడపల్లిలో బీజేవైఎం రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

బీజేపీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా

ముషీరాబాద్: నగరంలో బీజేపీని మరింత బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని బీజేపీ మహాకాళి జిల్లా నూతన అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి కుమార్ ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి కుషాల్‌గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో బీజేపీ మహాకాళి జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన భరత్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం నవీన్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, ముషీరాబాద్ బీజేవైఎం అధ్యక్షుడు ఆయూష్, సురేష్‌కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


భరత్‌గౌడ్‌ను సన్మానించిన కుషాల్‌గౌడ్, కంచికుమార్ ముదిరాజ్


హరికథా మహోత్సవంలో పాల్గొన్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

కళారూపాలతో ఇతిహాసాల ప్రచారం

● ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి లంక సుబ్రహ్మణ్యం

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు నాడు పురాణాలు, ఇతిహాసాలు తెలియజేయడంలో హరికథ, బుర్రకథలు వంటి కళారూపాలు ఎంతో దోహదం చేశాయని ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి లంక సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. హరికథ తెలుగు సంస్కృతిలో ప్రముఖ గుర్తింపు పొందిందన్నారు. సోమవారం నల్లకుంట శంకరమఠంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణాచారి జన్మదినం సందర్భంగా హరికథా సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరుకు చెందిన వై.రమణయ్య భాగవతార్‌చే భక్తమార్కండేయ హరికథ గానం చేయించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లంక సుబ్రహ్మణ్యం వై.రమణయ్యను సత్కరించి మాట్లాడారు. హరికథను పరిరక్షించుకుంటే తెలుగు సంస్కృతి కొనసాగుతుందన్నారు. నవలా రచయిత డా.ముదిగొండ శివప్రసాద్ మాట్లాడుతూ.. ఉత్తములు ఏది ఆచరిస్తే దానినే సమాజం అనుసరిస్తుందని అది గీతాచార్యుని వాఖ్యమన్నారు. డాక్టర్ కే.వీ.రమణాచారి మాట్లాడుతూ జానపద కళలకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిన్నెర సంస్థ సభ్యులు సుబ్బారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకాళి అమ్మవారి ప్రాణప్రతిష్ఠ


మహాకాళి ఆలయంలో అమ్మవారి ప్రాణప్రతిష్ఠలో పాల్గొన్న ఆలయ కమిటీ నిర్వాహకులు అరవింద్, అచ్చి, రామ్‌లక్ష్మణ్ దంపతులు

కవాడిగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ విద్యావిహార్ పాఠశాల వీధిలో నూతనంగా నిర్మించిన మహాకాళి దేవాలయంలో సోమవారం అమ్మవారి ప్రాణప్రతిష్ఠ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలతో అమ్మవారి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు, భక్తులు మంగళహారతులతో అమ్మవారిని ఎదుర్కొని ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం భక్త జన సందోహం మధ్య గణపతిహోమం, చండీహోమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో ఆలయ కమిటీ నిర్వాహకులు మాచర్ల అరవింద్, ఆకుల రామ, లక్ష్మణ్, రామకృష్ణ (అచ్చి) శ్రీధర్ బబ్లూ, సురేష్‌కుమార్, ఫొటో కిరణ్ కుమార్ తదితర బస్తీవాసులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అర్చకులు సాత్విక్‌శర్మ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి శాంతి కల్యాణ మహోత్సవం

చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని శృంగేరి జగద్గురు మహాసంస్థానము పంచముఖ ఆంజనేయ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు సందర్భంగా సోమవారం శ్రీవారి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సుప్రభాతం, విష్ణుసహస్రనామ స్తోత్రపారాయణ, నిత్యహోమం, అన్న సమారాధన, సంగీత కార్యక్రమం, బలిహరణ, శ్రీవారి గరుడోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కేంద్రం ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ఉద్యమించాలి


బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నాగభూషణం, కృష్ణగౌడ్

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉద్యమించాలని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ వైస్ చైర్మన్ జి.నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, రాష్ట్ర నాయకులు ధాత్రిక్ చెంచులాల్ పటేల్‌లు ముషీరాబాద్, అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి బడ్జెట్‌లో తెలంగాణకు నిధుల కేటాయింపులో కేంద్రం చేసిన అన్యాయంపై చర్చించారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష్యగట్టిందని, ఈ విషయాన్ని నియోజకవర్గాలలో ప్రజలకు తెలియజేసే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటిస్తుంది


సరస్వతి మాత విగ్రహం పూజలు నిర్వహించిన గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ, పోటీపరీక్షల అభ్యర్థులు, గ్రంథాలయ ఉద్యోగులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అతి త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటిస్తుందని హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయ సంస్థలో వసంత పంచమి సందర్భంగా సోమవారం కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ గ్రంథాలయ ఆవరణలో ఉన్న సరస్వతి అమ్మవారి విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోటీపరీక్షల అభ్యర్థులకు అన్నప్రసాదం, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ ఆవరణలో పోటీపరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు వచ్చే ఏడాది కల్లా ఉద్యోగాలు లభించి ఉన్నత పదవుల్లో ఉండాలని అభిలషించారు. ప్రభుత్వం అతి త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటిస్తుందని విద్యార్థులు కష్టపడి చదివి ఉద్యోగం పొందాలన్నారు. కార్యక్రమంలో అవినాష్, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేష్‌యాదవ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ మరమ్మతులు పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. సోమవారం డివిజన్‌లోని సూరజ్‌నగర్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ మరమ్మతు పనులను జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. పనులు ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు ఓంప్రకాష్, భీమ్‌రాజ్, ఎస్.ఎస్. రామ్, సూరి, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీధర్‌నుంచి నియామకపత్రం అందుకుంటున్న భావన

పంచసూత్రాలపై ప్రజల్లో చైతన్యం తెస్తా

చిక్కడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రజా కాంగ్రెస్(ఐపీసీ) పార్టీ పంచసూత్రాలపై ప్రజల్లో చైతన్యం తెస్తానని ఆ పార్టీ జాతీయ అధికారప్రతినిధి భావన తెలిపారు. ఐపీసీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ చేతులమీదుగా ఐపీసీ జాతీయ అధికార ప్రతినిధిగా సోమవారం భావన నియామకపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతృప్రేమతో పరిపాలన, ప్రజలందరికీ విద్య వైద్యం ఉచితం, మతసామరస్యాన్ని పాటిస్తూ గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించడం, భారతదేశంలో సంపూర్ణ మద్యపాన నిషేధం, మానవసేవ మాధవసేవ అనే పంచసూత్రాలకు ఆకర్షితురాలనై ఐపీసీ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ పంచసూత్రాలను సోషల్‌మీడియా ద్వారా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తానని ప్రజల్లో చైతన్యం తెస్తానన్నారు. పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు నారగోని, ఐపీసీ జాతీయ కార్యదర్శి నాదెండ్ల సుధాకర్, వ్యవస్థాపక సభ్యులు ఫైనాన్స్ రాజు, సలహాదారులు చిత్ర, నాదెండ్ల పద్మిని, పుష్పాంజలి, నందికొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షుడిగా కార్తీక్ ఏకలవ్య నియామకం

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా యతికిరి కార్తీక్ ఏకలవ్య నియమితులయ్యారు. సోమవారం సంఘం సమావేశంలో ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు సంఘం ప్రధాన కార్యదర్శిగా తిరుమలేష్ ఏకలవ్యను నియమించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య ఏకలవ్య, రాములు ఏకలవ్య, ఉపాధ్యక్షులు బండి ఏకలవ్యలు పాల్గొని వారికి నియామకపత్రం అందజేశారు.

వేర్వేరు రైలు ప్రమాదాలలో ఇద్దరి మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రైలు ప్రమాదాలలో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. మైలార్‌దేవులపల్లిలో నివాసం ఉంటున్న గునిశెట్టి భీమ్‌రావు(49) నేషనల్ పోలీసు అకాడమిలో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం బుద్వేల్- ఫలక్‌నామా రైల్వేస్టేషన్ల నడుమ పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో ఇదే రైల్వే స్టేషన్ల నడుమ కూరగాయలు విక్రయించి జీవనం సాగిస్తున్న ఒట్టిపల్లికి చెందిన మహ్మద్‌వహీద్(35) పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా సోమవారం పార్టీ సిటీ సెంట్రల్‌కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిటీ కార్యదర్శి ఎం. వెంకటేష్ అధ్యక్షతన జరిగిన నిరసనలో నాగయ్య మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు టి.జ్యోతి, బండారు రవికుమార్, డిజి నరసింహారావు, ఆర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా దీపక్‌రెడ్డి


దీపక్‌రెడ్డిని సత్కరిస్తున్న యశ్వంత్ తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. సోమవారం ఈ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. లంకల దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం సెంట్రల్ జిల్లా అధ్యక్షుడుగా నియమించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, యశ్వంత్, పి.గోవర్ధన్‌రెడ్డి, పెంటం రాజు, రాంచందర్ తదితరులు లంకల దీపక్‌రెడ్డిని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ జిల్లా పరిధిలోని అంబర్‌పేట, ఖైరతాబాద్, నాంపల్లి, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

విద్యార్థులు సంస్కృతీ, సాంప్రదాయాలను అలవర్చుకోవాలి

తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి


బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా ఆలయంలో పంచమి వేడుకల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే గోపాల్, ముఠా జైసింహ తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకొని ముందు కు సాగితే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. వసంతి పంచమి సందర్భంగా కవాడిగూడలో జరిగిన ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన సరస్వతి పూజాలో పులిగారి గోవర్ధన్‌రెడ్డి పూజలు నిర్వహించారు.

సాయిబాబా ఆలయంలో..


చిక్కడపల్లి: బాగ్‌లింగంపల్లి షిర్డీ సాయి బాబా ఆలయంలో వసంతపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 108 కలశాలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నల్లకుంట: మాఘ శుద్ధ వసంత పంచమి పురస్కరించుకుని సోమవారం నల్లకుంట డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలలో హోమాలు నిర్వహించారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించి కుంకుమార్చనలు చేసి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో పలువురు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు, అన్న ప్రాసనలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.జయంతి, ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో పూజలు

నల్లకుంట: వసంత పంచమి సందర్భంగా నల్లకుంటలోని అమ్మవారి ఆలయంలో ఢిల్లీకి చెందిన ఐఐటీ విద్యార్థులతో కలిసి టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ విద్యార్థులు ఆశుతోష్ ముఖర్జీ వినయ్, ఉద్ధంసింగ్ తదితరులు పాల్గొన్నారు.


వసంతి పంచమి సందర్భంగా కవాడిగూడలోని పాఠశాలలో పూజలు నిర్వహిస్తున్న న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలతరెడ్డి, విద్యార్థులు



శాకాంబరి అలంకరణలో అమ్మవారు